
మహిళలతో కోలాహలంగా హనుమకొండ బస్‌స్టేషన్


బాలికలతో మహబూబాబాద్ కలెక్టర్ శశాంక


మహిళలకు జీరో టికెట్ ఇస్తున్న జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా



మహాలక్ష్మి ఉచిత ప్రయాణ టికెట్‌ను ఆవిష్కరిస్తున్న జనగామ కలెక్టర్ శివలింగయ్య


జనగామలో బస్సు ముందు నిల్చొని విక్టరీ సింబల్ చూపిస్తున్న ట్రాన్స్‌జెండర్స్



### వేములవాడకు వెళ్తున్నా..

మాది స్టేషన్‌ఘన్‌పూర్. మేం అందరం కలిసి వేములవాడకు మొక్కు చెల్లించుకునేందుకు వెళ్తున్నాం. బస్సులో టికెట్ లేకుండా ఫ్రీగా వెళ్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. బస్సులో ఎక్కడికైనా టికెట్ లేకుండా వెళ్లేందుకు ప్రభుత్వం బాగా చేసింది. పైసలు కూడా మిగులుతాయి.

– ఎస్.పుష్ప, ప్రయాణికురాలు



### మధ్యతరగతికి మేలు..

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా బాగుంది. నిత్యం ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. దీని వల్ల ఆర్థికంగా కొంత మేలు జరుగుతుంది. విద్యార్థినులకు, మహిళా ఉద్యోగులకు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసే మధ్యతరగతివారికి ఎంతో మేలు. స్కీం మధ్యలోనే నిలిపివేయకుండా నిరంతరం కొనసాగించాలి.

– శ్రావణి, మెడిసిన్ విద్యార్థిని


హనుమకొండలో ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేస్తూ ఆధార్‌కార్డు చూపిస్తున్న మహిళలు


హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు జీరో టికెట్ ఇస్తున్న కండక్టర్


జీరో టికెట్‌ను చూపుతున్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

# హ్యాపీ ఫ్రీ జర్నీ

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం
- పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో వారికి జీరో టికెట్
- జెండా ఊపి ప్రారంభించిన అధికారులు
- తొలిరోజు ఆడబిడ్డలతో కిక్కిరిసిన బస్‌స్టేషన్లు

**అమలులోకి వచ్చిన 'మహాలక్ష్మి' పథకం**

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 9 : కొత్తగా కొలువుదీరిన రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని శనివారం అమలులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించగా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా సరే.. ఆర్టీసీ బస్సు ఎక్కితే చాలు టికెట్ తీసుకోకుండా ప్రయాణించే వెసులుబాటు కల్పించింది. అధికారంలోకి వస్తే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీ కల్పిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన మహాలక్ష్మి పథకం హామీని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం మధ్యాహ్నం లాంఛనంగా ప్రారంభించింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఆర్టీసీ ఉన్నతాధికారులు పూర్తి చేశారు. పథకాన్ని అమలు చేసేందుకు వీలుగా ఆర్టీసీ సిబ్బందికి ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేశారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసుల్లో మహిళలు, బాలికలు, విద్యార్థినులు, థర్డ్ జెండర్‌లు ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొంది.

### పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో..

పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని వెల్లడించింది. వరంగల్ రీజియన్ పరిధిలో నడిచే పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్‌లోనూ ఉచిత ప్రయాణం వర్తిస్తుందని ఆర్టీసీ ఆర్‌ఎం జె.శ్రీలత తెలిపారు. మహిళలతో పాటు బాలికలు, విద్యార్థినులు, థర్డ్‌జెండర్‌లు కూడా ఉచితంగా ప్రయాణించవచ్చని ఆమె పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ మార్గదర్శకాలను ఆమె వివరించారు. ఉచిత ప్రయాణంతో బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశమున్నందున, బస్‌స్టేషన్ల నిర్వహణపై దృష్టి సారించాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఉచిత ప్రయాణం అమలులో సిబ్బంది క్రమశిక్షణతో వ్యవహరించాలని, ఓపిక, సహనంతో విధులు నిర్వర్తించాలని ఆర్‌ఎం సూచించారు. 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలందరూ ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని ఆర్‌ఎం శ్రీలత కోరారు.


వరంగల్ ఎంజీఎం ఆవరణలో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

### తెలంగాణ పొలిమేర వరకు..

ఈ ఫ్రీ జర్నీ ఎన్ని కిలోమీటర్లు అన్న సందేహం అవసరం లేదు. ఎందుకంటే ఎన్ని కిలోమీటర్లు అయినా ఉచితమే. తెలంగాణ పొలిమేరల్లో ఉన్నంతవరకు ఏ మహిళకైనా టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేదు. ట్రాన్స్‌జెండర్లకు కూడా అవసరం లేదని తేల్చేశారు. ఏపీకి వెళ్లే తెలంగాణ బస్సుల్లో ఎక్కే మహిళలకు టికెట్ ఉచితమే, కాకుంటే తెలంగాణ రాష్ట్ర పొలిమేరల వరకు మాత్రమే. ఆ తర్వాత టికెట్ తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు.

### కండక్టర్లకు సూచనలు..

ఈ పథకం అమలు వేళ.. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ సిబ్బందికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరగడం వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించడంతో పాటు ఎలాంటి విసుగును ప్రదర్శించకుండా బాధ్యతతో వ్యవహరించాలని ఆర్టీసీ ఉద్యోగులకు హితబోధ చేశారు. అంతేకాదు మొదటివారం, పది రోజుల వరకు కూడా ఎలాంటి ధ్రువీకరణ పత్రాలను అడగాల్సిన అవసరం లేదని కండక్టర్లకు సూచించారు. ఉచితంగా తీసుకెళ్తున్నాం కాబట్టి సిబ్బంది నోటికి వచ్చినట్లుగా మాట్లాడొద్దని పదేపదే సూచించినట్లు పేర్కొన్నారు.

### 45శాతం మంది మహిళలే ప్రయాణం..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9 ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. ఇందులో 909 బస్సుల్లో పల్లెవెలుగు–453, మినీ పల్లె వెలుగు–13, సిటీ ఆర్డినరీ–57, ఎక్స్‌ప్రెస్‌లు–123, ఇతర బస్సులు–263 ఉండగా ప్రతిరోజు సుమారు 3 లక్షల కిలోమీటర్ల వరకు ఆయా డిపోల పరిధిలో తిరుగుతుండగా ప్రతిరోజూ ఆర్టీసీకి సుమారు కోటిన్నర వరకు ఆదాయం వస్తున్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. నిత్యం 2.80లక్షల మంది ప్రయాణిస్తుండగా అందులో 45శాతం మహిళలే ఉన్నారు. సుమారు 1.26 లక్షల మంది బాలికలు, మహిళలు ప్రయాణిస్తున్నారు. ఇందులో పల్లెవెలుగు, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే మహిళలు సుమారు 95వేల మంది ఉంటారు. వీరి ద్వారా రోజుకు రూ.47 లక్షల వరకు ఆదాయం ఆర్టీసీకి లభిస్తుంది. ఇక నుంచి ఈ మొత్తం మహిళా ప్రయాణికులకు మిగలనుంది. వరంగల్ రీజియన్ పరిధిలో రోజుకు సగటున రూ.1.40కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఉచిత ప్రయాణం వల్ల రోజుకు సుమారు రూ.47 లక్షల ఆదాయం ఆర్టీసీ కోల్పోనున్నది. ఈ మొత్తాన్ని రీయింబర్స్‌మెంట్ రూపంలో ప్రభుత్వం తిరిగి ఆర్టీసీకి చెల్లించనున్నది. ఉచిత ప్రయాణం వల్ల విద్యార్థినులు, యువతులు, మహిళలు ఉద్యోగులు, మహిళా కూలీలకు మేలు కలుగనుంది. జీరో టికెట్ వల్ల మహిళల బస్సు ప్రయాణాలు పెరిగే అవకాశం ఉన్నందున అవసరానికి సరిపడా బస్సులు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

### ఖర్చులు మిగులుతాయి..

బస్సుల్లో ఉచిత ప్రయాణం నిర్ణయం వల్ల ఖర్చులు మిగులుతాయి. అవసరం నిమిత్తం పట్టణాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు మేలు జరుగుతుంది. మేం మొత్తం 1100 మంది ఉంటాం. మాకు ఉచితంగా బస్సుల్లో ప్రయాణాన్ని కల్పిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– స్నేహ, అశ్విని, ట్రాన్స్‌జెండర్లు





### మహిళలు ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకోవాలి..

మహిళలకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తున్నది. పేద మహిళలకు ఎంతో ఉపయోగపడుతుంది. మహిళలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఏదైనా గుర్తింపుకార్డు చూపించాల్సి ఉంటుంది. పల్లెవెలుగు, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

– శ్రీలత, ఆర్టీసీ ఆర్‌ఎం

# ..అనే నేను

- అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన ఎమ్మెల్యేలు
- 14న ప్రమాణస్వీకారం చేయనున్న పల్లా, కడియం, కౌశిక్
- ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు మంత్రులకు శాఖల కేటాయింపు
- సీతక్కకు పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమం
- కొండా సురేఖకు దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖలు
- ఐటీ, ఐ అండ్ పీఆర్, శాసనసభ వ్యవహారాల మంత్రిగా శ్రీధర్‌బాబు
- పొన్నంకు రవాణా, బీసీ సంక్షేమం

వరంగల్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రులకు శాఖలు ఖరారయ్యాయి. వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి మంత్రులుగా ఉన్న ఇద్దరు మహిళలకు ముఖ్యమైన శాఖలు దక్కాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదనల మేరకు మంత్రులకు శాఖలను కేటాయిస్తూ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు ఎమ్మెల్యేగా గెలిచి తొలిసారి మంత్రి అయిన ధనసరి అనసూయ(సీతక్క)కు కీలకమైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖలను కేటాయించారు. తొలిసారి మంత్రి పదవి దక్కిన సీతక్కకు శాఖల పరంగానూ, సంఖ్య పరంగానూ ప్రభుత్వంలో ప్రాధాన్యత పెరిగింది. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖకు పర్యావరణం, అడవులు, దేవాదాయ శాఖలను కేటాయించారు. 2009 ఎన్నికల అనంతరం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కొండా సురేఖ తొలిసారి మంత్రి అయ్యారు. అప్పుడు మహిళా, శిశు సంక్షేమ శాఖల బాధ్యతలను నిర్వహించారు. ఏడాదిలోనే పదవికి రాజీనామా చేశారు. ఇప్పుడు రెండోసారి మంత్రి పదవి పొందారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భాగంగా ఉన్న మంథని నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి పొందిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కీలకమైన ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం, అసెంబ్లీ వ్యవహారాల శాఖలను కేటాయించారు. హనుమకొండ జిల్లాలో భాగంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన పొన్నం ప్రభాకర్‌కు రవాణా, వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖలను కేటాయించారు.

### ఓరుగల్లుకు తొలిసారి అటవీశాఖ

వరంగల్, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ) : తాజా మంత్రివర్గంలో స్థానం పొందిన కొండా సురేఖకు అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖలు కేటాయించగా ప్రధానంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఓ మంత్రికి అటవీశాఖ దక్కడం ఇదే తొలిసారి. 2014లో తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి అటవీ శాఖ మంత్రులుగా పనిచేశారు. ప్రస్తుత మంత్రివర్గంలో కొండా సురేఖ అటవీశాఖ పొందారు.

### ఎమ్మెల్యేల ప్రమాణం

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ వీరితో ప్రమాణం చేయించారు. సీతక్క(ములుగు), కొండా సురేఖ(వరంగల్ తూర్పు), రేవూరి ప్రకాశ్‌రెడ్డి(పరకాల), దొంతి మాధవరెడ్డి(నర్సంపేట), గండ్ర సత్యనారాయణరావు(భూపాలపల్లి), నాయిని రాజేందర్‌రెడ్డి(వరంగల్ పశ్చిమ), జాటోత్ రామచంద్రునాయక్(డోర్నకల్), భూక్య మురళీనాయక్(మహబూబాబాద్), మామిడాల యశస్విని(పాలకుర్తి), కె.ఆర్.నాగరాజు(వర్ధన్నపేట), దుద్దిళ్ల శ్రీధర్‌బాబు(మంథని), పొన్నం ప్రభాకర్(హుస్నాబాద్), కోరం కనుకయ్య(ఇల్లెందు), తెల్లం వెంకట్రావు(భద్రాచలం) ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలో ప్రమాణం చేశారు. కాగా ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి ఈనెల 14న అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.


మామిడాల యశస్విని
పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే


రేవూరి ప్రకాశ్‌రెడ్డి
పరకాల ఎమ్మెల్యే


దొంతి మాధవరెడ్డి
నర్సంపేట ఎమ్మెల్యే


గండ్ర సత్యనారాయణరావు
భూపాలపల్లి ఎమ్మెల్యే


రాంచంద్రు నాయక్
డోర్నకల్ ఎమ్మెల్యే


మురళీనాయక్
మహబూబాబాద్ ఎమ్మెల్యే


నాయిని రాజేందర్‌రెడ్డి
వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే


తెల్లం వెంకట్రావు
భద్రాచలం ఎమ్మెల్యే


కోరం కనుకయ్య
ఇల్లెందు ఎమ్మెల్యే


కే.ఆర్ నాగరాజు
వర్ధన్నపేట ఎమ్మెల్యే